తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
03-08-2026
సోమవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 176
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# ఉజ్జయిని మహంకాళికి బంగారు బోనం



## ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న కేటీఆర్

- తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు
- బీఆర్ఎస్ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడి

2



## బోనాల వేడుకల్లో సందడి

- మంత్రి పొన్నం నివాసంలో సీఎం రేవంత్‌తో కలిసి హాజరైన ప్రముఖులు
- ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా సంప్రదాయబద్ధంగా వేడుకలు
- ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఆతిథ్యం ఇచ్చిన పొన్నం
- తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేక బోనాల విందు

2



- బోనాల మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రులతో కలిసి పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించిన ముఖ్యమంత్రి
- రాష్ట్ర ప్రజల సుఖశాంతి, సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారికి ప్రార్థనలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రత
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని వ్యాఖ్య

2





# కాళేశ్వరం బ్యారేజీల కింద సాంకేతిక లోపాలు?

- జీపీఆర్ పరీక్షల్లో భూగర్భ అసాధారణతల గుర్తింపు
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనం
- 217 వెంట్ల పరిశీలనలో పలు చోట్ల కేవిటీస్, సీపేజీ మార్గాల గుర్తింపు
- నిర్మాణ లోపాలపై తుది నిర్ధారణ కాదన్న పరిశోధనా సంస్థ
- మరిన్ని ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచన

హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్)

తెలంగాణలో రాజకీయంగా చర్చనీయాంశమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక సాంకేతిక అంశం వెలుగులోకి వచ్చింది. ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భ పరిస్థితులను అంచనా వేసేందుకు నిర్వహించిన గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) పరీక్షల్లో పలు ప్రాంతాల్లో అసాధారణ పరిస్థితులు గుర్తించినట్లు సమాచారం. ఈ పరిశీలనల ఆధారంగా పుణెలోని కేంద్ర జల,

మిగతా 3వ పేజీలో..



# పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 'భారత్ ఫ్యూచర్ సిటీ', 'తెలంగాణ రైజింగ్-2047'తో అభివృద్ధికి కొత్త దిశ
- విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు

3



3

# ప్రవాసుల కోసం హైదరాబాద్‌లో ఎన్ఆర్ఐ భవన్

- రూ.10 కోట్లతో నిర్మాణానికి కృషి చేస్తానన్న మంత్రి జూపల్లి
- అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల్లో ప్రవాసులతో సమావేశం
- తెలంగాణ పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు

# రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం

- ముందుగానే ₹1.09 లక్షల కోట్ల పన్నుల వాటా విడుదల
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆర్థిక వెసులుబాటు
- అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు ₹19,208 కోట్లు, బీహార్‌కు ₹10,845 కోట్లు
- ఆంధ్రప్రదేశ్‌కు ₹4,597 కోట్లు, తెలంగాణకు ₹2,370 కోట్లు
- సాధారణ షెడ్యూల్‌కు ముందే నిధులు విడుదల చేసిన కేంద్రం

3





3

# 6,307 మంది చిన్నారులకు విముక్తి



# హైడ్రాకు ప్రజా మద్దతు వెల్లువ

- ఏవీ రంగనాథ్ కొనసాగింపునకు కాలనీ సంఘాల డిమాండ్
- అమీర్‌పేట, మధురానగర్ ప్రాంతాల్లో భారీ ర్యాలీలు
- చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపును ప్రశంసించిన ప్రజలు
- హైడ్రాపై దుష్ప్రచారాన్ని ఖండించిన సంక్షేమ సంఘాలు

3

# మత్తు రహిత భారతానికి యువతే బలం

- '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్
- గచ్చిబౌలిలో యువత, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన శివ ప్రతాప్ శుక్లా
- మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు



3

## డ్రగ్స్ రహిత యువతతోనే వికసిత్ భారత్

- 'నశా ముక్త్ యువ' జాతీయ ప్రచారానికి శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ
- దేశవ్యాప్తంగా 100 వారాల పాటు అవగాహన కార్యక్రమాలు
- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రధాని పిలుపు
- 10 వేలకుపైగా ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం
- ప్రతి ఆదివారం క్రీడలు, వాక్‌థాన్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు

4





4

## జంతర్‌మంతర్ నిరసనల్లో అల్లర్ల కుట్ర?



4

## బారాముల్లాలో ఉగ్ర అనుమానితుడి అరెస్టు

- కశ్మీర్‌లో భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్
- షేరీ సెక్టార్‌లో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న బలగాలు
- ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- కుల్గాంలో వలస కార్మికుల హత్య కేసులో ముమ్మర గాలింపు





# ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న కేటీఆర్

- **తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు**
- **పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు**
- **బోనాలు తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు ప్రతీక అని వ్యాఖ్య**
- **బీఆర్ఎస్ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడి**
- **రైతుల సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవాలని మొక్కులు**

హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్)

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న కేటీఆర్, బోనాల సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలందరూ కలిసికట్టుగా జరుపుకునే ఈ వేడుక తెలంగాణ సమాజ ఐక్యతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

సమైక్య రాష్ట్రంలో బోనాలకు తగిన గుర్తింపు లభించలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని కేసీఆర్ తరచూ చెప్పేవారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి, పండుగలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో తెలంగాణ కళకళలాడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. రైతుల సంక్షేమం, ప్రజల సుఖశాంతి కోసం ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నానని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్న లష్కర్ బోనాలు తెలంగాణ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# బోనాల వేడుకల్లో సందడి

హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్)

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికార నివాసంలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బోనాల విందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అతిథులకు తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఆప్యాయంగా స్వాగతం పలికారు. కార్యక్రమానికి వచ్చిన ప్రముఖులను స్వయంగా పలకరిస్తూ ఆతిథ్యం అందించారు. విందు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లి మల్లమ్మ, సతీమణి మంజుల, కుమారులు పృథ్వీ, ప్రణవ్‌తో పాటు కుటుంబ సభ్యులు, బంధువులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయం, ఆతిథ్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ ఆత్మీయ సమావేశం బోనాల సంబరాలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.




# ఉజ్జయిని మహంకాళికి బంగారు బోనం

హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్)

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి అర్చకులు, ఆలయ అధికారులు వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం, తెలంగాణ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రంపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

లష్కర్ బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగగా, బోనాల సంబరాలు నగరమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కతో పాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఆలయ పరిసరాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ, రాష్ట్ర ప్రజలంతా ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.



# బోనాల వేడుకల్లో అమెరికా కాన్సుల్ జనరల్ సందడి

- **ఉజ్జయిని మహంకాళికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన స్వాగతం**
- **బోనాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశిష్టతను వివరించిన మంత్రి**
- **తెలంగాణ–అమెరికా సాంస్కృతిక బంధాలు మరింత బలోపేతమవుతాయన్న ఆశాభావం**



హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్):

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం లారా ఈ. విలియమ్స్ సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఉజ్జయిని మహంకాళి ఆలయ చారిత్రక విశిష్టతతో పాటు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను అమెరికా కాన్సుల్ జనరల్‌కు వివరించారు. తెలంగాణ ప్రజల భక్తి, విశ్వాసాలు, సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.

ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే లష్కర్ బోనాల ఉత్సవాల ప్రత్యేకత, బోనం సమర్పణ అనంతరం జరిగే సంప్రదాయ 'రంగం' కార్యక్రమం ప్రాముఖ్యతను కూడా ఆమెకు వివరించారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశంగా బోనాల ఉత్సవాలు నిలుస్తున్నాయని, అమెరికా కాన్సుల్ జనరల్ పాల్గొనడం రెండు ప్రాంతాల మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

బోనాల ఉత్సవాల్లో ప్రత్యక్షంగా పాల్గొని తెలంగాణ సంప్రదాయాలను దగ్గరగా అనుభవించడం ఆనందంగా ఉందని లారా ఈ. విలియమ్స్ పేర్కొన్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ నడుమ బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగాయి.




# బోనాల భద్రతకు ఏఐ కవచం

- **ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనర్**
- **కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న నగర పోలీస్ కమిషనర్**
- **2,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు**
- **తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, ముఖ గుర్తింపు వ్యవస్థ వినియోగం**
- **భక్తుల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి**

హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్)

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ భాగ్యనగరంలో బోనాల పండుగకు విశిష్ట చారిత్రక ప్రాధాన్యం ఉందన్నారు. గోల్కొండ, బల్కంపేట బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయని తెలిపారు.

ఉజ్జయిని మహంకాళి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందితో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భక్తుల భద్రత కోసం తొలిసారిగా కృత్రిమ మేధ ఆధారిత జన సమ్మర్థ నిర్వహణ, నిఘా వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు.

ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలకు ముఖ గుర్తింపు సాంకేతికతను అనుసంధానించినట్లు సీపీ వివరించారు. దీని ద్వారా పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను వేగంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను నిరంతరం పర్యవేక్షిస్తూ, క్యూలైన్లలో రద్దీ పెరిగిన వెంటనే నియంత్రణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. తొక్కిసలాటలు వంటి ఘటనలు జరగకుండా అన్ని శాఖలతో సమన్వయంగా పని చేస్తున్నామని సజ్జనర్ తెలిపారు. దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల సహకారంతో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొంటూ, భక్తులు పోలీసు శాఖకు సహకరించి క్రమశిక్షణతో అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, ట్రాఫిక్ డీసీపీ అవినాశ్ కుమార్, అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.







# పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- ప్రపంచ స్థాయి ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 'భారత్ ఫ్యూచర్ సిటీ', 'తెలంగాణ రైజింగ్-2047'తో అభివృద్ధికి కొత్త దిశ
- విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు
- రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలని పిలుపు

**హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్)**

తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ వేగవంతమైన అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా నిర్వహించిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసీ) ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణను ఎన్ఆర్ఐలు, విదేశీ ప్రతినిధులకు వివరించారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, వచ్చే ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ఈ దిశగా 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌ను అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు అనుబంధంగా ముచ్చర్లలో కాలుష్య రహిత నెట్ జీరో ప్రమాణాలతో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాన్ని కోర్ అర్బన్, పెరి అర్బన్, రూరల్ అగ్రి ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.
విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విస్తృత సంస్కరణలు చేపట్టామని భట్టి తెలిపారు. పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. టాటా గ్రూప్ సహకారంతో రూ.2,100 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక డిజిటల్ శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టేందుకు హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేశామని భట్టి పేర్కొన్నారు. మూసీ నదిని శుద్ధి చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేసే మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందులను ఎదుర్కొందని ఆరోపించిన భట్టి, ప్రజా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో పరిస్థితిని మెరుగుపరిచిందన్నారు. ప్రస్తుతం ప్రతి నెల తొలి తేదీన ఉద్యోగుల వేతనాలు జమ చేస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి నిర్ణయాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ విస్తరణ, అంతర్జాతీయ పెట్టుబడుల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమైందని భట్టి తెలిపారు. తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరిందని పేర్కొంటూ, అమెరికాలోని తెలుగు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# హైడ్రాకు ప్రజా మద్దతు వెల్లువ

**హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్)**

హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాకు ప్రజల నుంచి మద్దతు పెరుగుతోంది. హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ, ప్రభుత్వ నిర్ణయానికి సంఘీభావంగా నగరంలోని పలు కాలనీ సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేసిన ప్రజలు, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు మద్దతు ప్రకటించారు. అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్, వెంగల్‌రావునగర్ ప్రాంతాలకు చెందిన పలు కాలనీ సంక్షేమ సంఘాలు ర్యాలీల్లో పాల్గొన్నాయి. హైడ్రా చర్యలను వ్యతిరేకిస్తూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ ప్రభుత్వానికి మద్దతు తెలిపాయి. హైడ్రా ఏర్పాటైన తర్వాత గత రెండేళ్లలో చేపట్టిన చర్యలు నగర ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయని సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. సుమారు 3,325 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడటంతో పాటు, రూ.1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు తెలిపారు. రెండు విడతల్లో 20 చెరువుల పునరుద్ధరణ చేపట్టి వరద ముప్పును తగ్గించే చర్యలు తీసుకుందని ప్రశంసించారు. అమీర్‌పేట, పరిసర ప్రాంతాల్లో గతంలో స్వల్ప వర్షాలకే నీరు నిలిచిపోయేదని, హైడ్రా రంగంలోకి దిగిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చిందని స్థానికులు తెలిపారు. జీహెచ్ఎంసీ, జలమండలి, నీటిపారుదల శాఖల సమన్వయంతో వరద సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఆక్రమణదారులు, వారికి అండగా నిలిచే కొందరు వ్యక్తులే హైడ్రాపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని కాలనీ సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. నగర ప్రయోజనాల దృష్ట్యా హైడ్రా కొనసాగాల్సిందేనని, ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే చర్యలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కొనసాగించాలా లేదా అన్న అంశంపై ఇటీవల చర్చలు జరుగుతున్న నేపథ్యంలో కాలనీ సంఘాల ర్యాలీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 6,307 మంది చిన్నారులకు విముక్తి

**హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్):**

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో 124 ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించి 6,307 మంది బాల కార్మికులు, వీధి బాలలను రక్షించాయి. ఈ ఆపరేషన్‌లో సుమారు 620 మంది పోలీసు సిబ్బంది పాల్గొని హోటళ్లు, దాబాలు, నిర్మాణ ప్రదేశాలు, ఇటుక బట్టీలు, వర్క్‌షాప్‌లు, వ్యాపార సంస్థల్లో రాత్రింబవళ్లు తనిఖీలు చేపట్టారు. రక్షించబడిన చిన్నారుల్లో 5,892 మంది బాలురు, 415 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 3,447 మంది తెలంగాణకు చెందినవారు కాగా, 2,860 మంది ఇతర రాష్ట్రాలు, నేపాల్‌కు చెందినవారిగా గుర్తించారు.

**బాల కార్మికులపై ఉక్కుపాదం**

రక్షించిన చిన్నారుల్లో 5,041 మంది బాల కార్మికులుగా పనిచేస్తుండగా, 647 మంది వీధి బాలలుగా, మరో 43 మంది భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసుల్లో బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టిన పోలీసులు మొత్తం 1,705 కేసులు నమోదు చేసి, 1,710 మందిని అరెస్టు చేశారు. కార్మిక శాఖ అధికారులు 1,381 తనిఖీ నివేదికలు జారీ చేయడంతో పాటు కనీస వేతనాల చట్టం కింద నిందితులకు రూ.37.95 లక్షల జరిమానా విధించారు.

**కుటుంబాలకు అప్పగింత..**

**అనాథలకు సంరక్షణ**

రక్షించిన చిన్నారుల్లో 5,737 మందిని అధికారులు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. కుటుంబ ఆధారం లేని లేదా అనాథలైన 570 మంది చిన్నారులను చైల్డ్ కేర్ సంస్థలకు తరలించి సంరక్షణ, పునరావాసం కల్పించారు. చిన్నారుల హక్కులను పరిరక్షిస్తూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తెలంగాణ పోలీసులు చేపట్టిన ఈ చర్యలను పలువురు అభినందిస్తున్నారు.

# మత్తు రహిత భారతానికి యువతే బలం

**హైదరాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్):**

మత్తు రహిత భారతదేశమే వికసిత్ భారత్‌కు బలమైన పునాదిగా నిలుస్తుందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఆదివారం నిర్వహించిన '10 కోట్ల మాదక ద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత, విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'లో భాగంగా తెలంగాణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గవర్నర్ తెలిపారు. మాదకద్రవ్య రహిత భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు.
భారత యువతే దేశానికి అతిపెద్ద శక్తి అని పేర్కొన్న గవర్నర్, మాదకద్రవ్యాల బారిన పడకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, యోగా, ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యతతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన యువతతోనే బలమైన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు.
ఈ సందర్భంగా '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' ప్రచార పోస్టర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. తెలంగాణ వ్యాప్తంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.
మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రభుత్వం మాత్రమే కాకుండా విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాలని గవర్నర్ అన్నారు. యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.




# ప్రవాసుల కోసం హైదరాబాద్‌లో ఎన్ఆర్ఐ భవన్



**బాల్టిమోర్, ఆగస్టు 2:, (సిరి న్యూస్)**

అమెరికా నుంచి తెలంగాణకు వచ్చే ప్రవాస భారతీయులకు అన్ని సేవలు ఒకే చోట అందుబాటులో ఉండేలా హైదరాబాద్‌లో ఎన్ఆర్ఐ భవన్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ భవన్ ప్రవాస భారతీయులకు సమన్వయ కేంద్రంగా ఉపయోగపడుతుందని అన్నారు. అమెరికాలోని బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణతో ప్రవాసుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యువత వ్యసనాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, మాదకద్రవ్యాలు, ఇతర సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు త్వరలో ప్రభాత భేరి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ సామాజిక ఉద్యమంలో ప్రవాస భారతీయులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**పర్యాటక అభివృద్ధిలో**

**ఎన్ఆర్ఐల భాగస్వామ్యం**

తెలంగాణలో పర్యాటక రంగానికి అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, వారసత్వ సంపదను అమెరికన్ తెలుగు అసోసియేషన్ బృందాలు, ప్రవాస భారతీయ సంఘాలు దత్తత తీసుకుని అభివృద్ధి, పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. అమెరికాలోని తమ మిత్రులు, సహచరులకు తెలంగాణ పర్యాటక వైభవాన్ని పరిచయం చేయాలని సూచించారు. తాము పుట్టి పెరిగిన గ్రామాల అభివృద్ధికి ప్రవాసులు అందిస్తున్న సహకారం అభినందనీయమని జూపల్లి అన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో ఎన్ఆర్ఐలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్యం కోసం ప్రజలు తమ స్థాయికి మించి ప్రైవేటు సంస్థలపై ఖర్చు చేస్తున్నారని, ప్రభుత్వ రంగంలో విద్య, వైద్య సదుపాయాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని మంత్రి తెలిపారు.

**ఎన్ఆర్ఐ కమిటీతో ముఖాముఖి**

అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్ఆర్ఐ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రవాసుల సమస్యలు, సంక్షేమం, తెలంగాణతో వారి అనుబంధాన్ని పెంచే అంశాలపై చర్చించారు. విదేశాల్లోని తెలుగు సంఘాలతో సమన్వయం, తెలంగాణలో పెట్టుబడులు, పర్యాటక అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవాసులతో ప్రభుత్వ అనుసంధానం వంటి అంశాలపై కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. ప్రవాస తెలుగువారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జూపల్లి తెలిపారు. ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

# కాళేశ్వరం బ్యారేజీల కింద సాంకేతిక లోపాలు?

**మొదటిపేజీ తరువాయి**

విద్యుత్తు పరిశోధనా సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) తెలంగాణ నీటిపారుదల శాఖకు సమగ్ర నివేదిక సమర్పించింది. జీపీఆర్ పరీక్షల ద్వారా బ్యారేజీల కింద సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భ నిర్మాణం, సీపేజీ మార్గాలు, రాతి పొరల పరిస్థితిని పరిశీలించారు. మొత్తం 225 వెంట్లలో 217 వెంట్ల వద్ద క్షేత్రస్థాయి అధ్యయనం నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాలు (కేవిటీస్), భారీ బండరాళ్లు, దెబ్బతిన్న రాతి పొరలు, పూడిక పేరుకుపోవడం వంటి అంశాలు నమోదైనట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.
మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌కు చెందిన 17 నుంచి 21 వరకు వెంట్లు, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్ వద్ద తీవ్రస్థాయి అసాధారణతలు గుర్తించినట్లు వెల్లడైంది. అన్నారం బ్యారేజీలో 5వ బ్లాక్‌లోని 47వ వెంట్, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, 53వ వెంట్ల పరిసరాల్లో కూడా భూగర్భ పరిస్థితుల్లో మార్పులు గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. మూడు బ్యారేజీల్లో కలిపి కేవలం 11 వెంట్ల కింద మాత్రమే ఎలాంటి అసాధారణ పరిస్థితులు కనిపించలేదని, మిగతా ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో భూగర్భ మార్పులు ఉన్నట్లు అధ్యయనంలో వెల్లడైనట్లు సమాచారం. మేడిగడ్డ వద్ద వేగవంతమైన నీటి ప్రవాహం కారణంగా ఇసుక కొట్టుకుపోయి రాఫ్ట్ దిగువన ఖాళీలు ఏర్పడిన అవకాశాన్ని కూడా పరిశీలకులు ప్రస్తావించారు.
అయితే జీపీఆర్ పరీక్షలు భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే ఉపయోగపడతాయని, నిర్మాణ లోపాలను నేరుగా నిర్ధారించవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది. మరమ్మతులు లేదా పునరుద్ధరణ చర్యలకు ముందు బోర్‌హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ (ఈఆర్‌టీఏ) వంటి అదనపు ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించింది. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు సమగ్ర భూగర్భ అన్వేషణ జరగకపోవడం వల్లే ఇటువంటి అంశాలు ముందుగానే గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం లేదా నీటిపారుదల శాఖ అధికారికంగా స్పందిస్తే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# జోగినిలు కన్నీరు పెడితే తెలంగాణకు అరిష్టం

- బోనాల ఏర్పాట్లపై జోగిని శ్యామల ఆగ్రహం
- తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ప్రభుత్వంపై విమర్శలు
- ఐదు పాస్‌లకే పరిమితం చేశారని ఆరోపణ
- జోగినిలకు ఆలయ బోర్డుల్లో అవకాశం ఇవ్వాలని డిమాండ్

**సికింద్రాబాద్, ఆగస్టు 2, (సిరి న్యూస్)**



బోనాల ఉత్సవాల్లో జోగినిలకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కన్నీరు పెడితే తెలంగాణ రాష్ట్రానికి మంచిది కాదని, అరిష్టం జరుగుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా ఆదివారం ఆలయానికి వచ్చిన ఆమె ప్రభుత్వ ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయని, తమలో ఊపిరి ఉన్నంత వరకు అమ్మవారి సేవకే అంకితం అవుతామని జోగిని శ్యామల అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాధారణ భక్తులతో పాటు జోగినిలకు కొంత ప్రాధాన్యం లభించేదని, ప్రస్తుత ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.
రాష్ట్రంలో వేలాది మంది శివశక్తులు ఉన్నప్పటికీ తమకు కేవలం ఐదు పాస్‌లు మాత్రమే ఇస్తామని చెప్పారని ఆమె పేర్కొన్నారు. ఆ ఐదుగురిలో ప్రముఖులకు భద్రత కల్పించాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆలయానికి వచ్చే సమయంలో భక్తుల రద్దీ మధ్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు.
బోనాల నిర్వహణకు ముందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశానికి తాము హాజరై సహకరించామని, కానీ ఆ తర్వాత భద్రత, పాస్‌ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని జోగిని శ్యామల అన్నారు. జోగినిల్లో చదువుకున్న వారు ఉన్నారని, ఆలయ పాలక మండళ్లలో తమకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ప్రశ్నించారు.
బోనాల పండుగను కేవలం రాజకీయ నాయకులు, పోలీసులు మాత్రమే నిర్వహిస్తున్నట్లు ఉందని ఆమె వ్యాఖ్యానించారు. మహంకాళి అమ్మవారి అసలు బోనాల వైభవం జోగినిలు బోనం ఎత్తినప్పుడే సంపూర్ణమవుతుందని అన్నారు. తమ సంప్రదాయాలకు గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం

**న్యూఢిల్లీ, ఆగస్టు 2, (సిరి న్యూస్)**

రాష్ట్రాల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పన్నుల వాటాలో భాగంగా మొత్తం ₹1,09,019 కోట్లను అడ్వాన్స్ రూపంలో రాష్ట్రాలకు విడుదల చేసింది. సాధారణంగా ప్రతి నెల 10వ తేదీన విడుదలయ్యే నిధులను ఈసారి ముందుగానే జమ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వాలకు తక్షణ ఆర్థిక వెసులుబాటు లభించనుంది. అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. మూలధన వ్యయాన్ని పెంచడం, రాష్ట్రాల నగదు ప్రవాహాన్ని మెరుగుపరచడం కూడా ఈ ముందస్తు నిధుల విడుదల ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా ₹19,208 కోట్లు కేటాయించగా, బీహార్‌కు ₹10,845 కోట్లు విడుదలయ్యాయి. పెద్ద జనాభా, అభివృద్ధి అవసరాల నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాలకు అత్యధిక వాటా దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ₹4,597 కోట్లు, తెలంగాణకు ₹2,370 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు రాష్ట్రాల్లో అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల పనులకు ఉపయోగపడనున్నాయి. సంక్షేమ పథకాలు, వేతనాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరుగుతున్న సమయంలో కేంద్రం ముందుగానే నిధులు విడుదల చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో రాష్ట్రాలపై తక్షణ ఆర్థిక ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రాజెక్టుల అమలు మరింత వేగవంతం కానుందని భావిస్తున్నారు. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ముందస్తు నిధుల విడుదలతో రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా ముందుకు సాగేందుకు అవకాశం లభిస్తుంది. ఆర్థిక సంవత్సరం మధ్యలో ఇంత పెద్ద మొత్తంలో అడ్వాన్స్ విడుదల చేయడం రాష్ట్రాలకు గణనీయమైన ఊరటగా మారిందని వారు అభిప్రాయపడుతున్నారు.



# బారాముల్లాలో ఉగ్ర అనుమానితుడి అరెస్టు

- కశ్మీర్‌లో భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్
- షేరీ సెక్టార్‌లో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న బలగాలు
- ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- కుల్గాంలో వలస కార్మికుల హత్య కేసులో ముమ్మర గాలింపు
- భద్రతా పరిస్థితులపై ఎల్‌జీ మనోజ్ సిన్హా సమీక్ష

**శ్రీనగర్, ఆగస్టు 2, (సిరి న్యూస్)**

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలపై భద్రతా దళాల చర్యలు కొనసాగుతున్నాయి. బారాముల్లా జిల్లాలోని షేరీ సెక్టార్ పరిధిలో సంయుక్త ఆపరేషన్ నిర్వహించిన భద్రతా బలగాలు ఓ ఉగ్ర అనుమానితుడిని అరెస్టు చేశాయి. అతని వద్ద నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఫతాగఢ్ ప్రాంతంలో అనుమానాస్పద కదలికలపై సమాచారం అందడంతో భారత సైన్యానికి చెందిన 46వ రాష్ట్రీయ రైఫిల్స్, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ 53వ బెటాలియన్ సంయుక్తంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నాయి. అయితే అతని గుర్తింపు, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు.

అరెస్టు చేసిన వ్యక్తికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయా, గతంలో ఏవైనా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్నాడా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఆయుధాలు ఎక్కడి నుంచి వచ్చాయి, అతనికి సహకరించిన వ్యక్తులు ఎవరనే అంశాలపై కూడా దర్యాప్తు సాగుతోంది.

మరోవైపు కుల్గాం జిల్లాలో ఇద్దరు వలస కార్మికుల హత్య ఘటన తర్వాత భద్రతా బలగాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనకు బాధ్యులైన ఉగ్రవాదులను గుర్తించేందుకు పలు ప్రాంతాల్లో సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని అధికార నేషనల్ కాన్ఫరెన్స్, ప్రతిపక్ష పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ డిమాండ్ చేశాయి.

పరిస్థితిని సమీక్షించిన జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై ఉగ్రవాద వ్యతిరేక చర్యలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న వలస కార్మికుల భద్రతకు అమలులో ఉన్న విధివిధానాలను సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. డీజీపీ నలిన్ ప్రభాత్‌తో పాటు ఇతర భద్రతా సంస్థల ఉన్నతాధికారులు సంఘటనా ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించడం, ఆయుధాల సరఫరా మార్గాలను అడ్డుకోవడం, సాధారణ ప్రజలు మరియు వలస కార్మికుల భద్రతను మరింత బలోపేతం చేయడంపై భద్రతా దళాలు ప్రత్యేక దృష్టి సారించాయి.

# డ్రగ్స్ రహిత యువతతోనే వికసిత్ భారత్

- 'నశా ముక్త్ యువ' జాతీయ ప్రచారానికి శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ
- దేశవ్యాప్తంగా 100 వారాల పాటు అవగాహన కార్యక్రమాలు
- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రధాని పిలుపు
- 10 వేలకుపైగా ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం



**న్యూఢిల్లీ, ఆగస్టు 2, (సిరి న్యూస్)**

డ్రగ్స్ రహిత యువతే అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి బలమైన పునాది అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యువతను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి దూరంగా ఉంచి, సామాజిక మార్పుకు భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 100 వారాల పాటు ఈ ప్రచారం కొనసాగనుంది. ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం కేవలం వ్యక్తుల కోసమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తు కోసం చేపట్టిన ప్రజా ఉద్యమమని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన యువత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్ వంటి ప్రమాదకర అలవాట్లకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని గత ఏడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని, ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించిందని ప్రధాని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో 125కు పైగా ఆధ్యాత్మిక సంస్థలు, సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములవడం సంతోషకరమని చెప్పారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటం ఒక్కరి వల్ల సాధ్యం కాదని, ప్రజలందరూ కలిసికట్టుగా ముందుకొస్తేనే విజయవంతమవుతుందని మోదీ అన్నారు. ఇప్పటికే లక్షలాది మంది యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారని, తమ పాఠశాలలు, కళాశాలలు, సమాజాల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు వస్తున్నారని వెల్లడించారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా పోటీలు, వాక్‌థాన్‌లు, ధ్యాన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, నాటకాలు, చర్చా వేదికలు, చిత్రలేఖన పోటీలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం కల్పించనున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన పౌరులతోనే అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించవచ్చని అన్నారు. 2020లో డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యాన్ని ప్రధాని ప్రకటించారని గుర్తుచేస్తూ, తాజా ప్రచారం ఆ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. దేశవ్యాప్తంగా 10 వేలకుపైగా ప్రాంతాల్లో విద్యాసంస్థలు, యువజన సంఘాలు, సివిల్ సొసైటీ సంస్థలు, పరిశ్రమల సంఘాలు, ఆధ్యాత్మిక సంస్థలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, మై భారత్ వాలంటీర్లు, యువజన క్లబ్బులు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ ఉద్యమంలో భాగస్వాములవుతున్నాయి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతే మార్పుకు రాయబారులుగా నిలవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. 100 వారాల పాటు కొనసాగే ఈ జాతీయ ప్రచారం ద్వారా డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# జంతర్‌మంతర్ నిరసనల్లో అల్లర్ల కుట్ర?

- పాక్ ఉగ్ర నెట్‌వర్క్‌తో యువజంటకు సంబంధాల ఆరోపణలు
- పశ్చిమ బెంగాల్ ఎస్టీఎఫ్ దర్యాప్తులో సంచలన అంశాలు
- జంతర్‌మంతర్ నిరసనల్లో గందరగోళం సృష్టించాలని పాక్ హ్యాండ్లర్ల ఆదేశాల ఆరోపణ
- హనీట్రాప్ ముఠా నిర్వహణపై దర్యాప్తు
- ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్ నుంచి ఆదేశాల మార్పిడి

**కోల్‌కతా, ఆగస్టు 2, (సిరి న్యూస్)**





పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) చేపట్టిన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. బర్ధమాన్‌లో హమీమ్ మొండల్‌ను, అనంతరం జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌లో అతని స్నేహితురాలు అర్పితా సర్కార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో పాకిస్థాన్ హ్యాండ్లర్ల సూచనల మేరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో అల్లర్లు, గందరగోళం సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తు ప్రకారం, ఈ కార్యకలాపాల కోసం పోలీసు యూనిఫారాలు కొనుగోలు చేసి మహిళలు, పురుషులతో కూడిన బృందంతో ఢిల్లీకి వెళ్లాలని హమీమ్‌కు సూచనలు అందినట్లు అధికారులు పేర్కొన్నారు. గత నాలుగు నుంచి ఐదు నెలలుగా అతను పాక్ ఆధారిత నెట్‌వర్క్ ప్రభావంలోకి వెళ్లినట్లు గుర్తించినట్లు తెలిపారు.

హమీమ్ బాధ్యతల్లో రాజకీయ నాయకులు, వీఐపీలు, పోలీసు అధికారుల వివరాలు సేకరించడం, కొత్త వ్యక్తులను నెట్‌వర్క్‌లోకి చేర్చడం కూడా ఉన్నట్లు ఎస్టీఎఫ్ వెల్లడించింది. నాలుగేళ్లుగా పరిచయమున్న అర్పితా సర్కార్‌ను కూడా ఈ కార్యకలాపాల్లో భాగస్వామిని చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభావశీల వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్ ముఠాను నిర్వహించినట్లు, అర్పితా ద్వారా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ సీనియర్ మంత్రి కుమారుడిని కూడా హనీట్రాప్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు.

వీరిద్దరూ వాట్సాప్, టెలిగ్రామ్, ఎలిమెంట్ ఎక్స్, సెషన్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో అబీర్ జాట్ 333, ఉజైర్, రాణా, హమద్ అనే నలుగురు కీలక హ్యాండ్లర్లను గుర్తించినట్లు ఎస్టీఎఫ్ ఐజీ గౌరవ్ శర్మ వెల్లడించారు. వీరు బ్రిటన్, మెక్సికో సిమ్ కార్డులను ఉపయోగిస్తూ యువతను తీవ్రవాద భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు ఆరోపించారు.

అర్పితా సర్కార్‌ను కోర్టు 13 రోజుల ఎస్టీఎఫ్ కస్టడీకి అప్పగించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలున్న మరికొందరిపై కూడా విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఆరోపణలకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది.

# ఢిల్లీలో ఎంపీ పప్పు యాదవ్‌పై దాడి యత్నం

- ప్రెస్‌మీట్‌లో షూ విసిరి.. కత్తితో దాడికి ప్రయత్నం
- అధికారిక నివాసంలో జరిగిన ఘటనతో కలకలం
- అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, అనుచరులు దుండగులను పట్టివేత
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- తన హత్యకు కుట్ర జరుగుతోందని ఎంపీ ఆరోపణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 2, (సిరి న్యూస్)**



బీహార్‌లోని పూర్ణియా లోక్‌సభ నియోజకవర్గ స్వతంత్ర ఎంపీ రాజేష్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్‌పై ఢిల్లీలో దాడి యత్నం చోటుచేసుకుంది. ఆయన అధికారిక నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరగడంతో రాజకీయ వర్గాల్లో కలకలం రేగింది.

సమావేశం కొనసాగుతుండగా ఓ వ్యక్తి ఒక్కసారిగా పప్పు యాదవ్ వైపు షూ విసిరాడు. అదే సమయంలో అక్కడే ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే భద్రతా సిబ్బంది, అనుచరులు వెంటనే అప్రమత్తమై వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

సమాచారం అందుకున్న ఢిల్లీ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరిని ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షెహర్‌కు చెందిన సుమిత్‌గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఘటనకు గల కారణాలు, దాడి వెనుక ఉన్న నేపథ్యంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఘటన అనంతరం స్పందించిన పప్పు యాదవ్ తనను హత్య చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇలాంటి దాడులకు తాను భయపడబోనని, ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "నన్ను చంపాలని ఎవరైనా భావిస్తే చంపనివ్వండి. కానీ ప్రజల కోసం నా పోరాటం ఆగదు" అని వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సహా పలువురు గ్యాంగ్‌స్టర్ల నుంచి తనకు ప్రాణహాని హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో, అధికారిక నివాసంలోనే ఈ దాడి యత్నం జరగడం భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఘటనపై ఢిల్లీ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సీజేపీ నిధులపై విచారణ కోరిన ఆర్టీఐ కార్యకర్త

- రూ.1 కోట్ల లీగల్ డిఫెన్స్ ఫండ్‌పై అధికారులకు ఫిర్యాదు
- ఎన్నికల సంఘం, కేంద్ర జీఎస్టీ అధికారులకు లేఖ
- సంస్థ చట్టబద్ధ హోదాపై విచారణ చేయాలని డిమాండ్
- వ్యవస్థాపకుడి కుటుంబ ఆర్థిక వ్యవహారాలపైనా ప్రశ్నలు
- రూ.1 కోటి విరాళం ప్రకటించిన కపిల్ సిబల్



**న్యూఢిల్లీ, ఆగస్టు 2, (సిరి న్యూస్)**

సీజేపీ (సీజేపీ) ఏర్పాటు చేసిన లీగల్ డిఫెన్స్ ఫండ్‌కు సంబంధించి ప్రకటించిన రూ.1 కోట్ల విరాళం నేపథ్యంలో ఆ సంస్థ కార్యకలాపాలపై విచారణ చేపట్టాలని సూరత్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం, కేంద్ర జీఎస్టీ అధికారులకు ఆయన లేఖలు పంపినట్లు తెలిపారు. సీజేపీ రాజకీయ పార్టీగా నమోదు కాకపోయినా రాజకీయ పార్టీ తరహాలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని అమిత్ తివారీ ఆరోపించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29ఏ ప్రకారం సంస్థ నమోదు అయిందా లేదా అనే అంశాన్ని ఎన్నికల సంఘం పరిశీలించాలని కోరారు. నమోదు లేకపోతే రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడం, ప్రజల నుంచి నిధులు సేకరించడం వంటి అంశాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కుటుంబ ఆర్థిక వ్యవహారాలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. మహారాష్ట్ర ప్రభుత్వంలో విశ్రాంత ఉద్యోగిగా పనిచేసిన అభిజిత్ దీప్కే తండ్రి భగవాన్‌రావు దీప్కే ఆర్థిక పరిస్థితిని పరిశీలించాలని, అలాగే అభిజిత్ దీప్కే విదేశాల్లో ఉన్నత విద్య కోసం అవసరమైన నిధులు ఎలా సమకూరాయో కూడా సంబంధిత సంస్థలు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రూ.1 కోట్ల లీగల్ డిఫెన్స్ ఫండ్‌పై 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందా లేదా అనే అంశాన్ని కూడా కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు పరిశీలించాలని తివారీ కోరారు. నిధుల స్వీకరణ, వినియోగం ప్రస్తుత పన్ను నిబంధనలకు అనుగుణంగా జరిగిందా అనే విషయంపై స్పష్టత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ సీజేపీ ఏర్పాటు చేసిన లీగల్ డిఫెన్స్ ఫండ్‌కు రూ.1 కోటి విరాళం అందజేస్తున్నట్లు ప్రకటించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసుకు సంబంధించిన నిరసనల సందర్భంగా నమోదైన కేసుల్లో చిక్కుకున్న వారికి న్యాయ సహాయం అందించేందుకు ఈ నిధిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అయితే అమిత్ తివారీ చేసిన ఆరోపణలు ప్రస్తుతం ఆరోపణల స్థాయిలోనే ఉన్నాయి. వాటిపై సంబంధిత అధికార సంస్థలు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం సీజేపీ చట్టపరమైన హోదా, నిధుల సేకరణ విధానం, పన్ను నిబంధనల అమలు వంటి అంశాలపై అధికారిక స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.



# రాజకీయాల్లోకి సీజేపీ అడుగు?

- ఆగస్టు 5న భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయం
- ఉద్యమ సంస్థగా కొనసాగాలా.. రాజకీయ పార్టీగా మారాలా?
- కోర్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయం
- యువత మద్దతుతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థ

**న్యూఢిల్లీ, ఆగస్టు 2, (సిరి న్యూస్)**

ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) రాజకీయ రంగ ప్రవేశంపై కీలక నిర్ణయం తీసుకోనుంది. ఉద్యమ సంస్థగా కొనసాగాలా? లేక రాజకీయ పార్టీగా మారాలా? అనే అంశంపై ఆగస్టు 5న నిర్వహించే కోర్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. సమావేశం తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడిస్తారని పార్టీ ప్రతినిధులు తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ ఉద్యమం తర్వాత అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో సీజేపీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. అయితే సీజేపీని కేవలం విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే ఉద్యమ వేదికగానే కొనసాగిస్తామని అభిజీత్ దీప్కే గతంలో స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య, శాంతియుత మార్గాల్లోనే పోరాటాలు కొనసాగిస్తామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఇతర పార్టీల్లో విలీనం కాబోమని ప్రకటించారు. ప్రస్తుతం విద్యా రంగ సమస్యలు, యువత ఎదుర్కొంటున్న అంశాలపై ఉద్యమాలను కొనసాగిస్తూ ప్రభావవంతమైన శక్తిగా నిలవడమే సీజేపీ ముందున్న సవాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా ఆధారంగా వేగంగా విస్తరించడం, పెద్ద సంఖ్యలో యువతను ఆకర్షించడం వంటి అంశాలు ఈ సంస్థకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని పేర్కొంటున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక ఇతర శక్తుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఉన్నప్పటికీ, సమాజంలో ఉన్న అసంతృప్తి, సమస్యలే ఇలాంటి ఉద్యమాలకు కారణమవుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆగస్టు 5 సమావేశంలో తీసుకునే నిర్ణయం సీజేపీ భవిష్యత్ దిశను నిర్ణయించనుంది.

# శంకర్ తండా శ్రీ సేవాలాల్ జగదాంబ ఆలయంలో చోరీ

- అమ్మవారి వెండి కిరీటం, హారం, ముక్కుపుడక అపహరణ

**శివ్వంపేట, ఆగస్ట్ 2 (సిరి న్యూస్):**



మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో వరుస దేవాలయ చోరీలు భక్తుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దేవాలయాలనే లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని దుండగులు వరుసగా చోరీలకు పాల్పడుతున్నారు. మూడు రోజుల క్రితం గూడూరు గ్రామంలోని శ్రీ గురుపీఠంలో చోరీ ఘటన మరువకముందే మరోసారి దుండగులు రెచ్చిపోయి శంకర్ తండాలోని శ్రీ సేవాలాల్ జగదాంబ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకున్నారు.మండలంలోని భీమ్లా తండా గ్రామపంచాయతీ పరిధిలోని శంకర్ తండా శ్రీ సేవాలాల్ జగదాంబ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని అమ్మవారి వెండి కిరీటం, హారం, ముక్కుపుడకతో పాటు రెండు హుండీల్లోని నగదును అపహరించారు. ఈ ఘటనలో సుమారు 30 తులాల వెండి ఆభరణాలు మరియు రెండు హుండీల్లో ఉన్న సుమారు రూ.60 వేల నగదు దొంగిలించినట్లు సమాచారం.చోరీ విషయం తెలిసిన వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎస్ఐ మధుకర్ రెడ్డి, ఏ ఎస్ ఐ భారతి ఆధ్వర్యంలో క్లూస్ టీం ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఆలయం పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.ఇటీవల వరుసగా దేవాలయాల్లో చోరీలు జరగడం స్థానిక భక్తుల్లో భయాందోళనకు గురిచేస్తోంది. ఆలయాల భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు దుండగులను త్వరగా అరెస్టు చేయాలని గ్రామస్థులు, భక్తులు పోలీసులను కోరుతున్నారు.



# నాలా కష్టాలకు చెక్.. రూ.10 లక్షలతో ఊరట..

- రూ.10 లక్షలతో నాలా వంతెన నిర్మాణం..
- కాలనీవాసులకు శాశ్వత ఉపశమనం..
- బీఆర్ఎస్ పాలనపై మాజీ ఎమ్మెల్యే విమర్శలు..
- కూన రాఘవేందర్ గౌడ్ సేవలకు ప్రశంసలు..

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 2 ( సిరి న్యూస్ ):**

ఏళ్ల తరబడి నాలా కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. స్థానిక కాంగ్రెస్ నాయకుడు కూన రాఘవేందర్ గౌడ్ సొంత నిధులతో పాటు కాలనీవాసుల సహకారంతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నాలా వంతెనను మాజీ ఎమ్మెల్యే పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా నాలా కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా దెబ్బతినేవని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టకుండా ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టేశారని విమర్శించారు. కూన రాఘవేందర్ గౌడ్ ప్రజల అవసరాన్ని గుర్తించి సొంత నిధులతో పాటు కాలనీవాసుల సహకారంతో నాలా వంతెన నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ వంతెనతో స్థానిక ప్రజలకు శాశ్వత ఉపశమనం లభించిందని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోయాయని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరింత కొనసాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో కూన రాఘవేందర్ గౌడ్ మరింత ముందుండాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో కూన రాఘవేందర్ గౌడ్, నాగిళ్ల శ్రీనివాస్, చౌడ శ్రీనివాస్, నారాయణ గౌడ్, మక్బూల్, ఫిరోజ్, అలీముద్దీన్, మహమ్మద్ మైన్, అజ్జు పటేల్, ఆరిఫ్, షకీల్, నయీమ్, ఖలీమ్, మోహన్, బాలమణి పాల్గొన్నారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై వంతెన నిర్మాణంపై హర్షం వ్యక్తం చేశారు.




# ఆరే గూడెం గ్రామంలో దుర్గమ్మకు ఘనంగా బోనాల ఊరేగింపు..

- గ్రామ దేవతలకు బోనాల సమర్పణ

**వెల్దుర్తి,ఆగస్టు02, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం ఆరెగూడెం గ్రామంలో ఆషాడ మాసం పురస్కరించుకొని ఆదివారం దుర్గమ్మకు గ్రామస్తులు బోనాల ఊరేగింపు ఘనంగానిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో వేప కొమ్మలు, కుంకుమ, పసుపు, పూలు, నైవేద్యంతో అందంగా అలంకరించిన కుండలను మహిళలు నెత్తిన పెట్టుకొని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. యువకులు, పోతురాజులు డీజే చప్పుల్ల మధ్య నృత్యం చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చైతన్య హనుమంత్ రెడ్డి, ఉప సర్పంచ్ వార్డు సభ్యులతో పాటు, గ్రామపెద్దలు, సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామంలో బంధుమిత్రులతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి గ్రామస్తులంతా ఆనందంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.





# మొక్కలే భావితరాల భరోసా..

- పచ్చదనమే భావితరాలకు భరోసా..
- మొక్కల సంరక్షణపై ఎమ్మెల్యే పిలుపు..
- స్నేహితుల దినోత్సవ వేడుకల్లో చిన్నారులతో సందడి..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 2 ( సిరి న్యూస్ ):**

పచ్చదనం కోసం ప్రజలందరూ ఉద్యమంలా ముందుకు రావాలని, మొక్కల సంరక్షణే భావితరాలకు అందించే అమూల్యమైన కానుక అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీజీ హోమ్స్ కాలనీలో ఘనంగా నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఇంటి ముందు ఒక మొక్క నాటి, దానిని చెట్టుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి పౌరుడిదేనని పేర్కొన్నారు. పర్యావరణ హితం, పిల్లల బంగారు భవిష్యత్తు కోసం అందరూ చెట్ల పెంపకాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పచ్చదనం కోసం బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, వీజీ హోమ్స్ కాలనీ వాసులు చేపట్టిన కార్యక్రమం ఆదర్శప్రాయమని అభినందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం ద్వారా ప్రత్యేక నిధులతో కోట్లాది మొక్కలు నాటి తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపామని, పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో గుర్తింపులు, అవార్డులు సాధించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలనీలోని చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే సందడి చేశారు. చిన్నారులు స్నేహబంధం పట్టీ కట్టగా, ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పిల్లలకు పంపిణీ చేయడంతో కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, ప్యాక్స్ ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి, పూజారి లక్ష్మణ్ గౌడ్, భూ లక్ష్మణ్, వాసుదేవ రెడ్డి, కిట్టు, బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ప్రతినిధులు, వీజీ హోమ్స్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బెస్త గంగపుత్ర సంఘం బోనాల వేడుకలో పాల్గొన్న సింధు ఆదర్శ్ రెడ్డి..

**రామచంద్రపురం, ఆగస్టు 2 (సిరి న్యూస్):**

ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా బీఎచ్ఈఎల్‌లో బెస్త గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. సంఘ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

అనంతరం బెస్త గంగపుత్ర సంఘం సభ్యులతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొని బీఎచ్ఈఎల్ పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, కృష్ణారావు, మదన్, ప్రవీణ్, శ్రీధర్‌తో పాటు సంఘ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హౌసింగ్ ఏఈకి ఘన సత్కారం..

- హౌసింగ్ ఏఈ డేవిడ్ భాస్కర్‌కు ఘన సన్మానం..
- పదవీ విరమణ వేడుకలో నాయకుల అభినందనలు..
- సేవలకు ప్రశంసలు.. శాలువాతో సత్కారం..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 02 (సిరి న్యూస్)**




తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మంచిర్యాల జిల్లా సహాయక ఇంజనీర్ ఉండేటి డేవిడ్ భాస్కర్ పదవీ విరమణ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘన సన్మాన సభ నిర్వహించారు. సేవాకాలంలో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువాతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, మాజీ సర్పంచ్ సుజాత శ్రీనివాస్, సర్పంచ్ సింగతి రాణి తిరుపతి, సర్పంచ్ కూన్సత్ నారాయణ, మాజీ సర్పంచ్ జనగామ తిరుపతి, గురునాథం మల్లగౌడ్, గొల్లపల్లి అధ్యక్షుడు తమ్మినవేణి రాజేష్, మైలారం అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, ఓబీసీ మంచిర్యాల వెంకటేష్, బోర్లాకుంట వెంకటేష్, గోగు సురేందర్ పాల్గొని డేవిడ్ భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆయనకు జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. సభలో పాల్గొన్న వారు డేవిడ్ భాస్కర్ సేవలను కొనియాడుతూ ఆయన భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్‌కు అవగాహన లేదు

- గ్రావిటీతో నీరు వస్తుందన్న వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతల మండిపాటు
- పాదయాత్రలు, పూజలతో పంపులు పనిచేయవని వ్యాఖ్య
- ప్రాజెక్టు నిర్వహణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్
- రైతుల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసిన నేతలు

**కరీంనగర్, ఆగస్టు 2, (సిరి న్యూస్)**

కాళేశ్వరం ప్రాజెక్టు, గ్రావిటీ విధానంపై సరైన అవగాహన లేకుండానే కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలకు పరిమితం కావడం సరికాదని హితవు పలికారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌ను ఆదివారం బీఆర్ఎస్ నేతల బృందం సందర్శించింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ రంగానికి కాళేశ్వరం ప్రాజెక్టు కీలక ఆధారంగా నిలిచిందన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా ప్రాజెక్టుపై విమర్శలు చేయడం తగదని అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కీలక నీటి వనరులని తెలిపారు. మేడిగడ్డ వద్ద వృథాగా సముద్రంలో కలిసే వరద జలాలను వినియోగించుకునే ఉద్దేశంతోనే కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించామని చెప్పారు. రాజకీయ విమర్శల కంటే రాష్ట్ర నీటి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ గ్రావిటీతోనే నీరు వస్తుందని చెబుతున్న కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ పంపులు ఎందుకు ఏర్పాటు చేశారో వివరించాలని ప్రశ్నించారు. మేడిగడ్డ నుంచి గాయత్రి పంప్‌హౌస్ వరకు నీటిని తరలించేందుకు ఎత్తిపోతల వ్యవస్థ అవసరమని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమని, అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో సాగునీటి రంగంలో అనేక మార్పులు జరిగాయని పేర్కొన్నారు. రాజకీయాల కోసం రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టవద్దని సూచించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పంట పొలాలకు సకాలంలో నీరు అందించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు.

# బోనాల పండుగలను భక్తిశ్రద్ధలతో ఐకమత్యంతో నిర్వహించుకోవాలి

- అన్నారం బోనాల ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్
- ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికిన దేవాలయ కమిటీ
- అమ్మవారికి మొక్కులు సమర్పించిన ప్రజాప్రతినిధులు
- గ్రామంలో ఉదయం నుంచే పండుగ శోభ

**గుమ్మడిదల, ఆగస్ట్ 2 (సిరి న్యూస్):**



గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని అన్నారం గ్రామంలో నిర్వహిస్తున్న ఆషాఢ బోనాల మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా కొనసాగాయి. ఉదయం నుంచే గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనగా, పోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. రంగురంగుల అలంకరణలు, డప్పు చప్పుళ్లు, సంప్రదాయ బోనాలతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌తో పాటు పురపాలక సంఘం పాలకవర్గం సభ్యులు, ప్రజాప్రతినిధులు పోచమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తమ మొక్కులను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులకు దేవాలయ కమిటీ చైర్మన్ మద్ది వీరారెడ్డి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ఐకమత్యంతో నిర్వహించుకోవడం ఆనందదాయకం అన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కత్తుల రమేష్, కిషన్, కుమార్ గౌడ్, రాజశేఖర్, మురళి, సంజీవరెడ్డి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సత్యనారాయణ, తుపాకుల రాజు, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, శేఖర్ రెడ్డి, రామ్ రెడ్డి, తిరుమల్ రెడ్డి (చిన్న), సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## స్పారోకాన్ ఆర్కిటెక్ట్స్‌లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన గీతం విద్యార్థులు..

**పటాన్చెరు, ఆగస్టు 2 (సిరి న్యూస్):**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌కు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మోసిన్, శ్రియా, మరియా స్పారోకాన్ ఆర్కిటెక్ట్స్‌లో తమ వేసవి ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. స్పారోకాన్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ ఆర్. జబ్బర్ షేక్ మార్గదర్శకత్వంలో వారు వృత్తిపరమైన ఆర్కిటెక్చరల్ విధానాలు, సమకాలీన డిజైన్ పద్ధతులు, ప్రాజెక్టు అమలు, కార్యాలయ నిర్వహణపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ), యూనివర్సిటీ ఇండస్ట్రీ సెల్ (యూఐసీ) సమన్వయంతో ఈ అవకాశం లభించగా, ఆర్కిటెక్చర్ స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బందన్ కుమార్ మిశ్రా ఈ కార్యక్రమానికి మద్దతు అందించారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, నేర్చుకోవాలనే ఆసక్తి, వృత్తిపరమైన పనితీరును ఆర్కిటెక్ట్ జబ్బర్ షేక్ ప్రశంసించారు. భవిష్యత్తులో గీతంతో మరిన్ని ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమవిద్యా భాగస్వామ్య కార్యక్రమాలు చేపట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసినట్లు విశ్వవిద్యాలయం వెల్లడించింది.



## భానూరులో ధనమైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, ఆగస్టు 2 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు మండలం భానూరు గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ ధనమైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జోగిపేటలో ఘనంగా రజకుల బోనాల ఊరేగింపు

**జోగిపేట, ఆగస్టు 02, (సిరి న్యూస్):**

ఆషాడ మాసం సందర్భంగా అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఈరోజు 15వ వార్డులో రజకసంగము ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు తీయడం జరిగింది వర్షాలు బాగా పడాలే పాడిపంటలు బాగా పండాలె రైతులు ప్రతి ఒక్కరి ఇండ్లల్లో ఆనందం వెల్లివిరియలే అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరికి అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకోవడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు ) ఆత్మ కమిటి డైరెక్టర్ ఖాలేదు, కాంగ్రెస్ లీడర్ సోహెయిల్, చోటు, రమేష్, చెన్నయ్య, గంగని రమేష్, మురళి, రవి, సుబ్బు,చంటి, భరత్, రాజు, రమేష్, శ్రీనివాస్, జోగయ్య, అలాగే రజక సంఘం మహిళలు పాల్గొన్నారు .



## పెద్దమ్మతల్లి బోనాల్లో బీఆర్ఎస్ నాయకులు..

**రామచంద్రపురం, ఆగస్టు 2 (సిరి న్యూస్):**

బీఎచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాలు, ఫలహారం బండి ఊరేగింపులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు





## కుత్బుల్లాపూర్ లో ఉచిత వైద్య రక్తదాన శిబిరం

- **మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి.**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి ఆగస్టు2,(సిరి న్యూస్):**

కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వేణు గోపాల స్వామి ఆలయం సమీపంలో అమ్మ సేవా ఫౌండేషన్ ఫర్ హ్యూమానిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడడంతో పాటు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు వై. చరిత్ కుమార్, కే. విగ్నేష్, విశాలి బెలే, సుజన్, డి. అజయ్ యాదవ్, భార్గవ్, నవ్య, సాయి స్నేహిత్, రాహుల్ దాస్, అభినవ్ సాయి, రోహిత్, విజయ్, కృష్ణవేణి, మహేందర్, కీర్తి, వరుణ్, అభిషేక్, రేణుక, పావని, నల్ల నాగుల కృష్ణ, జ్ఞానేశ్వర్, కనకయ్య, డి. శ్రీనివాస్, వేణు, కుంట అర్జున్ ముదిరాజ్, అరుణ్ డాక్టర్, తులసి, సాయి రెడ్డి, మహేష్, శ్రావణ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



## బోనాల సంబరాలతో కళకళలాడిన గుమ్మడిదల మున్సిపాలిటీ గ్రామాలు

- **గుమ్మడిదల, అన్నారం, వీరన్నగూడెంలో పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు**
- **తెలంగాణ జానపద గీతాలతో మారుమోగిన గ్రామాలు**

**గుమ్మడిదల, ఆగస్ట్ 2 (సిరి న్యూస్):**

ఆషాడ మాసం సందర్భంగా గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని గుమ్మడిదల, అన్నారం, వీరన్నగూడెం గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత శ్రీ పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బోనాల సమర్పణతో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచే గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై రంగురంగుల బోనాలు ఎత్తుకుని డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, జానపద కళాకారుల ప్రదర్శనల నడుమ అమ్మవారి ఆలయాలకు ఊరేగింపుగా చేరుకున్నారు. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ వీధులన్నీ విద్యుత్ దీపాల అలంకరణలు, రంగవల్లులు, తోరణాలతో శోభాయమానంగా కనిపించాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల పాటలు, జానపద గీతాలు, మైక్ సౌండ్‌లతో గ్రామాలన్నీ మారుమోగిపోయాయి. ఎక్కడ చూసినా భక్తి, ఉత్సాహం, ఆనందం వెల్లివిరిసింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, గ్రామ ప్రజల సుఖశాంతులు, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించారు. మొక్కులు తీర్చుకున్న భక్తులు బోనాలు సమర్పించడంతో పాటు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు కళాకారుల విన్యాసాలు, జానపద నృత్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణను ప్రతిబింబించే బోనాల పండుగను ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా గ్రామ ప్రజలు ఐక్యతకు ప్రతీకగా, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా అత్యంత వైభవంగా నిర్వహించడంతో గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని గ్రామాలు పండుగ శోభతో కళకళలాడాయి.







## 'మేమెంతో.. మాకంత' నినాదంతో బీసీ ఉద్యమం.

- **ఓబీసీ మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ..**
- **7 న చలో బెంగుళూరు.**

**రామాయంపేట, ఆగస్టు 2( సిరి న్యూస్ )**

మేమెంతో.. మాకంత అనే నినాదంతో బీసీ సంక్షేమ సంఘం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని సంఘం నాయకులు మెట్టు గంగారం, రాగి రాములు, పోచమ్మల గణేష్ తెలిపారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో ఆదివారం అఖిల భారతీయ ఓబీసీ జాతీయ మహాసభల గోడపత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆగస్టు 7న కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో నిర్వహించనున్న అఖిల భారతీయ ఓబీసీ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని బీసీ ప్రజలు, సంఘాల నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నాయకులు, దేశంలో కేవలం 4 శాతం జనాభా ఉన్న ఓసీ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించారని, అయితే 56 శాతం జనాభా ఉన్న బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించకపోవడం అన్యాయమని విమర్శించారు. బీసీలకు 56 శాతం రిజర్వేషన్ అమలు చేసే వరకు తమ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, సామాజిక న్యాయం అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా గౌరవాధ్యక్షులు మెట్టు గంగారం,బీసీ యువజన సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు పోచమ్మల గణేష్,బీసీ రాష్ట్ర నాయకులు రాగి రాములు,బీసీ సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి సుంకోజు దామోదర్ , అక్కన్నపేట సర్పంచ్ కక్కన్న గారి యాదగిరి బీసీ సంక్షేమ సంఘం మెదక్ నియోజకవర్గం ఇంచార్జ్ మామిడి సిద్ధరాములు, బీసీ సంక్షేమ సంఘం రామాయంపేట మండల అధ్యక్షులు ఉడుత రాజేశం, జిల్లా నాయకులు రెడ్డమైన నరేష్,ధర్మారం గ్రామం అధ్యక్షులు పిట్లా శ్రీశైలం,రిటైర్డ్ టీచర్ భాస్కర్, జిల్లా నాయకులు పోచమ్మల శ్రీనివాస్, చాకలి నారాయణ, రాధా కిషన్ తదితరులు ఉన్నారు.

## వేమనపల్లి లైబ్రరీకి వరం..

- **వేమనపల్లి గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాల కానుక..**
- **విద్యార్థుల కోసం సొంత నిధులతో ముందుకొచ్చిన ప్రవీణ్..**
- **త్వరలో తాగునీటి శుద్ధి యంత్రం ఏర్పాటు హామీ..!**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 02 (సిరి న్యూస్)**

విద్యార్థుల ఉన్నత విద్య, పోటీ పరీక్షల సన్నద్ధతకు తోడ్పాటుగా వేమనపల్లి గ్రంథాలయానికి అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ తన సొంత నిధులతో అందజేశారు. ఇటీవల గ్రంథాలయాన్ని సందర్శించిన సందర్భంగా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవని విద్యార్థులు వివరించడంతో వెంటనే స్పందించి పుస్తకాలను కొనుగోలు చేసి గ్రంథాలయానికి అందించారు. అంతేకాకుండా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శితో మాట్లాడి మంచిర్యాల గ్రంథాలయం నుంచి కుర్చీలను కూడా తెప్పించారు. త్వరలో గ్రంథాలయంలో తాగునీటి శుద్ధి యంత్రాన్ని కూడా ఏర్పాటు చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత ఉద్యోగాలు సాధించి వేమనపల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని రేణికుంట్ల ప్రవీణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దస్నాపూర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, ఏనుముల శేఖర్, చెన్నూరు సంతోష్, విద్యార్థులతో కలిసి గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు.










# ప్రజారోగ్యానికి వరం.. త్వరలో నూతన ఆసుపత్రి..

- **ఆసుపత్రి పనులకు ఎమ్మెల్యే వేగం.. త్వరలో ప్రజలకు అందుబాటు..**
- **నాణ్యతలో రాజీ లేదు.. అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 02 (సిరి న్యూస్)**

మంచిర్యాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కాలేజ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న నూతన ప్రభుత్వ ఆసుపత్రి పనులను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులను ప్రశ్నించి, నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఆసుపత్రిని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని అన్నారు. ఆధునిక వైద్య సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మాణం పూర్తైతే మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మేయర్ ధర్ని మధుకర్, సంబంధిత శాఖ అధికారులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్నేహానికి సరిహద్దులు లేవు ఫ్రెండ్షిప్ డే వేడుకల్లో సందడి

- **గుమ్మడిదల పారిశ్రామికవాడలో ఆనందోత్సవాల మధ్య స్నేహితుల దినోత్సవం**

**గుమ్మడిదల, ఆగస్టు 2( సిరి న్యూస్ ):**



స్నేహానికి కులమతాలు లేవు ఉన్నోడు లేనోడు అన్న తారతమ్యాలు లేవు చిన్నోడు పెద్దోడు అన్న బంధాలు లేవు మగ ఆడ అన్న తేడాలు లేకుండా అందరూ ఆనందోత్సవాలు ఆనందోత్సవాల మధ్య మరోసారి ఫ్రెండ్షిప్ డే వేడుకలు చాటిచెప్పాయి. ప్రతి ఏడాది ఆగస్టు నెల తొలి ఆదివారం నిర్వహించే అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గుమ్మడిదల పురపాలక సంఘంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో స్నేహితులు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్లు స్నేహితుల సందడితో కళకళలాడాయి. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకుని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొందరు కేక్‌లు కట్ చేస్తూ హ్యాపీ ఫ్రెండ్షిప్ డే అంటూ సంతోషాన్ని పంచుకున్నారు. యువతతో పాటు చిన్నారులు, పెద్దలు కూడా ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చాలా రోజులుగా కలుసుకోని స్నేహితులు ఈ ప్రత్యేక దినాన్ని పురస్కరించుకుని ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొందరు స్నేహితులు మొక్కలు, పుస్తకాలు, జ్ఞాపికలు బహుమతులుగా ఇచ్చిపుచ్చుకుని తమ అనుబంధాన్ని మరింత బలపరిచారు. సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర మాధ్యమాల్లో కూడా ఫ్రెండ్షిప్ డే సందడి కనిపించింది. స్నేహితులతో కలిసి దిగిన ఫొటోలు, పాత జ్ఞాపకాలను పంచుకుంటూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవితంలో ప్రతి దశలో స్నేహితులు అండగా నిలుస్తారని, స్నేహబంధం ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, పరస్పర సహకారానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా ఒకరినొకరు ఆదుకునే బంధమే నిజమైన స్నేహమని వారు అభిప్రాయపడ్డారు. గుమ్మడిదల మండల వ్యాప్తంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా సాగగా, చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఆనందంగా పాల్గొని ఈ ప్రత్యేక దినాన్ని జరుపుకున్నారు. పురపాలక సంఘం గుమ్మడిదలలోని ముదిరాజ్ సంఘం భవనంలో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు





# మహంకాళి జాతర వైభవం..

- **మహంకాళి బోనాలకు భారీ వైభవం..**
- **అమ్మవారి సేవలో రాజకీయ ప్రముఖులు..**
- **బోనాలు.. తొట్టెల ఊరేగింపులు ఘనం..**
- **భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2 ( సిరి న్యూస్ ):**



ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మహంకాళి అమ్మవారి జాతరలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు, తొట్టెల ఊరేగింపులతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని మూసాపేట్, ఖైత్లాపూర్ ప్రాంతాల్లో జరిగిన బోనాల వేడుకల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఖైత్లాపూర్ శ్రీ మహంకాళి అమ్మవారిని, మూసాపేట్ హెచ్‌పీ రోడ్డులోని శ్రీ బంగారు మైసమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబు రావు, పండాల సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మూసాపేట్ కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తొట్టెల ఊరేగింపులో భక్తులతో కలిసి పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు మొక్కెర ఐలయ్య ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఖైత్లాపూర్ శ్రీ కాళికామాత, శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయాల్లోనూ రాజేశ్వరరావు పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదాలు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. మూసాపేట్‌లోని శ్రీ మైసమ్మ తల్లి, శ్రీ ఉప్పలమ్మ తల్లి, శ్రీ బీరప్ప స్వామి ఆలయాల్లో జరిగిన బోనాల వేడుకల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బోయిన్‌పల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 35వ వార్షిక మహంకాళి జాతరలో పలహారం బండి ఊరేగింపు ఘనంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు గజ్జెల నాగేష్ పాల్గొని జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన మహంకాళి బోనాల వేడుకల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..







# పలాంబరి దేవిగా వన దుర్గ మాత

- **వివిధ రకాల ఫలాలతో అమ్మవారి అలంకరణ**
- **మంజీరా నదిలో భక్తుల పుణ్య స్నానాలు**
- **అమ్మవారికి ఒడిబియ్యం బోనాలు సమర్పణ**

**పాపన్నపేట్ ఆగస్టు 2 సిరి న్యూస్**



ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గ భవాని ఆలయం లో ఆషాడ మాసం పురస్కరించుకొని ఆదివారం రోజు అన్ని రకాల పండ్లతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు ఉదయం పంచామృతాలతో అభిషేకించి అన్ని రకాల పండ్ల అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చే విధంగా అలంకరణ చేశారు. ఉదయం నుండి భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారి దర్శించుకోవడానికి రావడం జరిగింది. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ ఈవో వీరేశం సిబ్బంది అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.



# చదునైన రహదారి.. సాఫీ ప్రయాణం..

- **బురద రోడ్డుకు తక్షణ పరిష్కారం..**
- **ట్రాక్టర్ బ్లేడుతో రహదారి చదును..**
- **వాహనదారులకు భారీ ఊరట..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 02 (సిరి న్యూస్)**

బెల్లంపల్లి పట్టణంలో వర్షాల కారణంగా బురదమయంగా మారి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంబేద్కర్ చౌరస్తా నుంచి రాజా మసీదు వరకు ఉన్న మట్టి రహదారిని ట్రాక్టర్ బ్లేడుతో చదును చేయించి ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించారు.
బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ దావా స్వాతి రమేష్‌బాబు ఆధ్వర్యంలో 19వ వార్డు కౌన్సిలర్ శంకర్ సింగ్, బెల్లంపల్లి బస్తీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాంపెల్లి శ్రీనివాస్ సమక్షంలో ఈ పనులు చేపట్టారు. వర్షపు నీటితో రహదారిపై పేరుకుపోయిన మట్టి, గుంతలను ట్రాక్టర్ బ్లేడుతో చదును చేయించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుర్గం మహేందర్, వార్డు సభ్యుడు అక్కపాక రంజిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు కాపురపు కిరణ్ కుమార్, కాంపెల్లి శివకుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా స్నేహితుల దినోత్సవం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మిత్రులు

**జిన్నారం ఆగస్టు 2 సిరి న్యూస్**

బొల్లారం సర్కిల్ పరిధిలో వేడుకలు స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం మిత్రులందరూ ఒకే చోట చేరి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు పంచుకున్నారు. పాత జ్ఞాపకాల నెమరువేత అనాటి అల్లరి స్కూల్ కాలేజ్ రోజులు కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన క్షణాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. చెదరని ఐక్యత కాలం మారిన జీవితంలో ఎన్ని బాధ్యతలు పెరిగిన తమ మధ్య ఉన్న ఆప్యాయత స్నేహ బంధం ఎప్పటికీ మారదని దోస్తులు స్పష్టం చేశారు.
భవిష్యత్తు ప్రయాణాలు తీపి కలయిక ఇచ్చిన ఉత్సాహంతో రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయాణాలు వేడుకలు కలిసి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

# విద్యాబాలన్ వెయిట్ లాస్ స్టోరీ

బాలీవుడ్ బ్యూటీ విద్యాబాలన్ బరువు తగ్గి స్లిమ్‌గా కనిపిస్తోంది ఇప్పుడు. తను బరువు తగ్గి, నాజూగ్గా అవ్వడానికి వెనకున్న రహస్యం ఏంటో ఓ సందర్భంలో బయటపెట్టింది. అదేంటంటే...



"నా జీవితంలో బరువు విషయంలో ఎన్నో అనుభవాలున్నాయి. గతంలో హార్మోన్ల సమస్య కారణంగా బరువు పెరిగా. ఈ క్రమంలో చాలామంది నన్ను విమర్శిస్తుంటే నేనూ నా శరీరాన్ని అసహ్యించుకునేదాన్ని. ఒక్కోసారి కోపం, చిరాకు వచ్చేవి. నాజూగ్గా మారి నన్ను నేను నిరూపించుకోవాలని నా శరీరాన్ని ఇబ్బంది పెట్టిన రోజులు కూడా ఉన్నాయి. కానీ ఇది కరెక్ట్ కాదని రియలైజ్ అయ్యా. అప్పట్నించి బరువు పెరిగినా.. తగ్గినా.. ఎలా ఉన్నా.. నన్ను నేను యాక్సెప్ట్ చేయడం మొదలుపెట్టా. దాంతో నా శరీరంపై నాకు ఇష్టం పెరిగింది. తగ్గాలనిపించినప్పుడు తగ్గుతున్నా. నేను ఎక్కువగా ఇంట్లో వండిన ఆహారమే తీసుకుంటా. గ్లూటెన్ ఫుడ్స్‌కి దూరంగా ఉంటా. ఏది తీసుకున్నా పచ్చివి మాత్రం అస్సలు తీసుకోను. ఇలా పచ్చి ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరాకృతిని మెయింటెయిన్ చేయడం సాధ్యమవుతుంద"ని చెప్పింది విద్యాబాలన్.

### నో రా (no raw) డైట్ అంటే..

ఈ డైట్‌లో పచ్చివి తీసుకోకూడదు. కాయగూరలు, మాంసం వంటి రోజువారీ తీసుకునే ఆహార పదార్థాలేవైనా.. ఉడికించడం లేదంటే ఇతర పద్ధతుల్లో వండుకొని తీసుకోవడం వల్ల వీటిలోని పోషకాలు శరీరానికి అందుతాయి. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడి సులభంగా జీర్ణమవుతుంది అంటున్నారు నిపుణులు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు ఈ ఆహార నియమాలు పాటించడం మంచిది అంటున్నారు. కొన్ని రకాల పచ్చి ఆహార పదార్థాల్ని తీసుకోకపోవడం వల్ల ఆరోగ్యానికి కూడా ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు నిపుణులు. అవేంటంటే..







- ముఖ్యంగా మాంసం, గుడ్లు, పాశ్చరైజేషన్ చేయని పాలుపాల పదార్థాల్లో ఈ కొలై, సాల్మోనెల్లా.. వంటి హానికారక బ్యాక్టీరియా ఉంటుంది. సరైన ఉష్ణోగ్రత వద్ద వీటిని ఉడికిస్తే ఆహారం ద్వారా సంక్రమించే వ్యాధులకు దూరంగా ఉండొచ్చట.
- ఉడికించడం వల్ల... ఆహార పదార్థాల్లో ఉండే సంక్లిష్టమైన ప్రొటీన్, ఫైబర్.. వంటి పోషకాలు విచ్ఛిన్నమవుతాయి. ఫలితంగా ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలు, గ్యాస్ట్రిక్, కడుపుబ్బరం.. వంటి సమస్యలున్న వాళ్లు ఇలా ఉడికించుకొని తీసుకోవాలి.
- ఉడికించిన తర్వాతే యాంటీ ఆక్సిడెంట్లు, బీటాకెరోటిన్.. వంటి పోషకాల్ని శరీరం త్వరగా గ్రహిస్తుంది. కాబట్టి ఇవి ఎక్కువగా ఉండే టొమాటో, క్యారట్.. వంటివి ఉడికించుకొని తీసుకోవడం మంచిది.
- అయితే 'No Raw' డైట్ వల్ల ఆరోగ్యానికి పలు ప్రయోజనాలున్నప్పటికీ.. కొన్ని పదార్థాల్ని ఉడికించడం వల్ల వాటిలోని పోషకాలు నశించే అవకాశమూ ఉందంటున్నారు నిపుణులు. అందుకే ఆ పోషకాలు తరిగిపోకుండా వండుకోవాలంటున్నారు.
- అలాగే కొంతమంది పచ్చి కాయగూరల్ని నీటిలో ఉడికిస్తుంటారు. దీనివల్ల 'బి', 'సి'.. వంటి నీటిలో కరిగే విటమిన్లు నశించిపోతాయి. కాబట్టి ఇలాంటి కుకింగ్ పద్ధతులకు దూరంగా ఉండడం బెటర్. అందుకే.. స్టీమ్ మీద ఉడికించడం, తక్కువ నూనెలో వేగించడం వంటి పద్ధతులు ఫాలో అవ్వాలి. అయితే, డ్రైఫ్రూట్స్, పండ్లు, పండ్ల రసాలు, మొలకెత్తిన గింజలు, నట్స్, విత్తనాలు.. వంటివి పచ్చిగానే తీసుకోవాలి.



చిన్ని ముఖం, బోసి నవ్వులు.. చూస్తుంటే మనసుకు ఎంతో హాయి కలుగుతుంది ఎవరికైనా. అలాంటిది బిడ్డను కన్న తల్లికి ఎంత ఆనందంగా ఉంటుంది.. 'అమ్మా' అనే పిలుపు కోసం పరితపిస్తుంటుంది తల్లి మనసు. తాను చెప్పే కథలన్నీ వింటూ ఊ.. కొట్టాలని కోరుకుంటుంది. అమ్మని తేరిపారా చూస్తుంటే.. తల్లి మనసు ఆనందంతో ఉప్పొంగిపోతుంది. కానీ... ఇవేవీ అనుభూతి చెందకుండా ఉండడం ఓ తల్లికి సాధ్యమయ్యే పనికాదు.అలాంటిది తన పాపకి అమ్మా అని పిలవలేదని, తన మాటలు బిడ్డకు వినపడడం లేదని.. అంతెందుకు.. అసలు ఆ బిడ్డ కళ్లకు తల్లి కనిపించట్లేదని తెలిస్తే.. ఆ తల్లి మనసు తట్టుకుంటుందా? ఇలాంటి ప్రత్యేక అవసరాలున్న పిల్లల తల్లుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడానికి కూడా కష్టంగానే ఉంటుంది. అలాంటి పరిస్థితిని ఎదుర్కొని, తన బిడ్డలాంటి అనేకమంది పిల్లల కోసం 'మారిపోసా ఫౌండేషన్ సెంటర్' స్థాపించింది సేజల్. ఇదే ఆమె విజయగాథ.

# ఆ ఆలోచనే నన్ను మార్చింది

సక్సెస్ స్టోరీ

తన కడుపులో కవలలు పెరుగుతున్నారని తెలిసి ఎంతో సంతోషించింది సేజల్. అయితే, ప్రెగ్నెన్సీలో కొన్ని సమస్యల వల్ల నెలలు నిండకుండానే డెలివరీ అయింది. ఇద్దరిలో ఒక్కరే మిగిలారు. తనూ బతకడం కష్టమేనన్నారు డాక్టర్లు. నెలలపాటూ ఐసీయూలోనే ఉంచాల్సి వచ్చింది. వందరోజుల చికిత్స తర్వాత తమ బిడ్డ విహాను వాళ్ల చేతుల్లో పెట్టారు. ఆ సంతోషం ఎంతోసేపు నిలువలేదు ఆ తల్లిదండ్రులకు. వైద్యులు చెప్పిన మాట విని నిర్ఘాంతపోయారు. 'ఆక్సిజన్ ఎక్కువై తనకు రెటినాల్ డిటాచ్‌మెంట్ అయిందనీ, ఇకపై చూడలేద'ని చెప్పారు. తను పెరిగేకొద్దీ దృష్టిలోపంతోపాటు మానసిక ఎదుగుదలలోనూ లోపాలు ఉన్నాయని తెలిసింది. సొంత పనులు చేసుకోవడం కూడా చాలా కష్టమని వాళ్లకు అర్థమయింది.



### మారిపోసా ఫౌండేషన్ సెంటర్

విహాకు ఐదారేళ్లప్పుడు హెలెన్ కెల్లర్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించారు. తొమ్మిదేళ్లు వచ్చాక తను మాటలు నేర్చుకోవడం కోసం వోకల్ ట్రైనింగ్ అవసరమని వేరే చోటుకి తీసుకెళ్లమని అక్కడివాళ్లు చెప్పారు. దక్షిణ బాంబే అంతా తిరిగినా, విహాకు సరిపోయే శిక్షణా కేంద్రం ఒక్కటీ కనిపించలేదు. ఎందుకంటే తనకు మల్టిపుల్ డిజేబిలిటీస్ ఉన్నాయి. ఇటువంటి పిల్లలకు రోజువారీ పనులు నేర్పించాల్సి ఉంటుంది. తినటం దగ్గరనుంచీ బట్టలువేసుకోవడం, మోటార్ స్కిల్స్, వంటివి అనేకం నేర్పించాలి. ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ కూడా అవసరమవుతుంది. వీళ్లలో జ్ఞానేంద్రియాల సమన్వయం ఉండదు. అందుకు వారికి సెన్సరీ స్టిమ్యులేషన్ ఇవ్వాలి. ఆర్ట్, సంగీతం వంటి వాటిలోనూ భాగం చేయాల్సి ఉంటుంది. అప్పుడే సేజల్ ఒక నిర్ణయానికి వచ్చింది. విహా లాంటి ప్రత్యేక అవసరాలున్న పిల్లలకోసం తనే ఒక కేంద్రాన్ని నెలకొల్పాలని నిర్ణయించుకుంది. అలా వచ్చిందే 'మారిపోసా ఫౌండేషన్ సెంటర్'. ప్రస్తుతం ఇందులో 14మంది పిల్లలున్నారు. మారిపోసా ప్రారంభించాక అక్కడికి వచ్చిన పిల్లల్ని చూస్తోంది. ఒక్కొక్కరికీ ఒక్కో సమస్య. వాళ్ల అవసరాలను బట్టి, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్ని రూపొందించడం కోసం పరిశోధనలూ చేస్తోంది.

### ఇప్పుడు నా కోరిక అదే

మొదట్లో విహా చూడడం, నవ్వడం లాంటివి ఏమీ చేసేది కాదు. కానీ తర్వాత విహా పలికిన మొదటి మాట 'పాపా'.. ఆ మాట విన్నప్పుడు సేజల్ చాలా సంతోషించానని చెప్పింది. "ఏదో ఒకరోజు తను నా దగ్గరికొచ్చి అందరి పిల్లల్లానే నాతో మాట్లాడుతుందనీ, నడవడం, పరిగెత్తడం... వంటివి చేస్తుందని ప్రతిరోజూ అనుకుంటా. కానీ ఇప్పుడు నా కోరిక ఒక్కటే. తను ఎలా ఉన్నా... జీవితాంతం సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటే చాలు. అయితే, ఒక్కోసారి ఆ బిడ్డకు అమ్మగా నన్ను ఎప్పుడూ వెంటాడే భయం ఒక్కటే. ఒకవేళ దురదృష్టవశాత్తూ నేను ఈ లోకంలో లేకపోతే, తనను ఎవరు చూసుకుంటారనే ప్రశ్నే నన్ను బలహీనురాల్ని చేసేది. అప్పుడే నేనో విషయం తెలుసుకున్నా. నేను ఎంతగా ఆలోచించినా, బాధపడినా లాభం లేదని సర్దిచెప్పుకొంటా. ప్రస్తుతం ఉన్న క్షణాల్ని ఆనందంగా మలుచుకోవడమే తప్ప మనచేతుల్లో ఏమీ ఉండదు. ఇప్పుడు జీవితం నాకు విహాతోపాటు అనేకమంది పిల్లలకు తల్లిగా మారే అవకాశాన్నీ ఇచ్చింది. అది చాలు.. వాళ్లకు ప్రేమను పంచుతూ తృప్తిగా గడిపేస్తా" అంటోంది సేజల్.

# ఆ నొప్పులకు ఈ ఆసనాలు



యోగాతో మనసుకు, శరీరానికీ ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఒక్కో ఆసనం ఒక్కో విధంగా పనిచేస్తుంది. అయితే, ముఖ్యంగా ఆడవాళ్ల సమస్యలకు అద్భుతంగా పనిచేసే వాటిలో విపరీత కరణి ఆసనం ఒకటి. మరి దానివల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

విపరీత కరణి ఆసనం రోజూ సాధన చేయడం వల్ల తలనొప్పి తగ్గుతుంది. శరీరాన్ని యాక్టివ్‌గా ఉంటుంది. ఈ ఆసనం వల్ల కటి వలయ కండరాలకు, ప్రత్యుత్పత్తి వ్యవస్థకు రక్తప్రసరణ సాఫీగా ఉంటుంది. తద్వారా ప్రత్యుత్పత్తి సమస్యలు రాకుండా జాగ్రత్తపడొచ్చు. ప్రత్యుత్పత్తి వ్యవస్థకు రక్తప్రసరణ బాగా జరిగి నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది ఈ ఆసనం. నడుం కింది భాగంలో నొప్పి కొంతమంది మహిళల్ని ఇబ్బంది పెడుతుంటుంది. ఇలాంటి వారు రోజూ 5-20 నిమిషాల పాటు విపరీత కరణి ఆసనం సాధన చేస్తే కొన్ని రోజుల్లోనే నొప్పి నుంచి ఉపశమనం పొందొచ్చు అంటున్నారు నిపుణులు. ఈ ఆసనం వేసినప్పుడు శరీరానికి వ్యతిరేక దిశలో ఒత్తిడి తగలడం వల్ల థైరాయిడ్ గ్రంథికి రక్తప్రసరణ చక్కగా అందుతుంది. ఫలితంగా హైపో/హైపర్ థైరాయిడ్ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. అయితే ఎవరైనా సరే దీనిని సాధన చేసేముందు ఒకసారి నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

# ఉజ్జయిని మహంకాళి బోనాల ఏర్పాట్లపై సమీక్ష

**మున్సిపల్ చైర్మన్ రజిని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం.. ఈనెల 9 నుండి జాతర ఉత్సవాలు**

తూప్రాన్, ఆగస్టు 2 (సిరి న్యూస్) :
తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మ వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం తూప్రాన్ పట్టణానికి సంబంధించి మహంకాళి అమ్మవారి ఆలయంలో జాతర మహోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.




www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

సోమవారం
ఆగస్టు-03-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 204

MEDAK, SANGAREDDY, SIDDIPET

పేజీలు : 4








# రాయసముద్రం కాల్వలకు మోక్షం ఎప్పుడు?

- "సిరి" కథనానికి స్పందించి హామీలు.. ఆచరణలో మాత్రం శూన్యం
- రోజురోజుకూ పెరుగుతున్న చెరువు నీటిమట్టం
- ముంపు ముప్పు తప్పదనే స్థానికుల ఆందోళన
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

3

## "ఇల్లు కాలాక ఆకులు పట్టుకున్నట్లు" అధికారుల తీరు

"ఇల్లు కాలాక ఆకులు పట్టుకున్నట్లు" అన్న చందంగా రాయసముద్రం చెరువు కాల్వల వ్యవహారంలో అధికారుల తీరు కనిపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "ఉన్న కాలువకు నో కల్వర్టు.. లేని కాలువకు కల్వర్టు..!" అంటూ సిరి పత్రిక ప్రచురించిన కథనానికి స్పందించిన ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి పలు హామీలు ఇచ్చారు. తూము కాల్వ ద్వారా జాతీయ రహదారి కింద సహజ నీటి ప్రవాహానికి చర్యలు తీసుకుంటామని, కాల్వల ఆక్రమణలను తొలగిస్తామని, ఇరిగేషన్ శాఖతో కలిసి కాల్వలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. అయితే రోజులు గడుస్తున్నా ఆ హామీలు అమలుకు నోచుకోకపోవడంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. -రామచంద్రాపురం, ఆగస్టు 2, (సిరి న్యూస్):





2

# చిట్టీల పేరుతో రూ.4 కోట్ల తోకరా

- మాయమైన లేడీ కిలాడి
- నమ్మిస్తే రూ.4 కోట్లు కాజేశారు
- చిట్టీల బోర్డు తిప్పేసిన బిఎస్ఆర్ కాలనీ మహిళ
- నమ్మించారు నామం పెట్టారు
- రోడ్డున పడ్డ కుటుంబాలు పిఎస్ మెట్లెక్కిన బాధితులు

# పీఏసీఎస్‌ను దేవేందర్ రెడ్డి అభివృద్ధి చేశారనడం హాస్యాస్పదం

సిరి ఎఫెక్ట్

**25 ఏళ్లుగా కోనాపూర్‌కు చేసింది శూన్యం**

**రైతుల సొమ్ము దుర్వినియోగంపై సమాధానం చెప్పాలి**

**దళితులపై వివక్ష చూపెట్టారు..**

**పీఏసీఎస్ వైస్ చైర్మన్, డైరెక్టర్ల విమర్శ**


4



కోనాపూర్ గ్రామ పీఏసీఎస్‌ను దేవేందర్ రెడ్డి అభివృద్ధి చేశారంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా పచ్చి అబద్ధమని, వాస్తవాలను ప్రజల నుంచి దాచిపెట్టి, ప్రచారంతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని పీఏసీఎస్ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మామిడి సిద్ధిరాములు, డైరెక్టర్లు గడ్డం సురేష్, నందు మహిపాల్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షాదుల్లా, సొసైటీ సభ్యుడు సాగర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. సిరి పత్రికలో కోనాపూర్ గ్రామ పిఏసిఎస్ కు సంబంధించి అప్పటి చైర్మన్ దేవేందర్ రెడ్డి విషయంలో వచ్చిన ప్రత్యేక కథనానికి వారు స్పందించారు.

రామాయంపేట, ఆగస్టు 2 (సిరి న్యూస్)







# తూప్రాన్ లోని ఉజ్జయిని మహాంకాళి బోనాల ఏర్పాట్లపై సమీక్ష

- మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం
- ఈనెల 9 నుండి జాతర ఉత్సవాలు

తూప్రాన్, ఆగస్టు 2 (సిరి న్యూస్) : తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ ఉజ్జయిని మహాంకాళి అమ్మ వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం తూప్రాన్ పట్టణానికి సంబంధించి మహాంకాళి అమ్మవారి ఆలయంలో జాతర మహోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్టణ పురోహితులు, గ్రామ పెద్దలు, ప్రజలు, కౌన్సిలర్లు అమ్మవారి కార్యక్రమాలు నిర్వహించే పనిబాటల వారు తూప్రాన్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఈనెల 9వ తేదీన అమ్మ వారికి బోనాలు, 10న గావు రంగాలు, అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 10 వ వార్డు వెంకటపట్నం గ్రామంలో 8వ తేదీన అమ్మవారికి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, గావురంగాలు, పోతురాజుల విన్యాసాలు, 9వ తేదీన అమ్మవారికి బోనాలతో విశేష పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.





# చిట్టిల పేరుతో రూ.4 కోట్ల తోకరా

- మాయమైన లేడీ కిలాడి
- నమ్మిస్తే రూ. 4 కోట్లు కాజేశారు
- చిట్టిల బోర్డు తిప్పేసిన బిఎస్ఆర్ కాలనీ మహిళ
- నమ్మించారు నామం పెట్టారు
- రోడ్డున పడ్డ కుటుంబాలు పిఎస్ మెట్లెక్కిన బాధితులు

**అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బిఎస్సార్ కాలనీకి చెందిన చిట్టిల వ్యాపారి మహిళ మాయాజాలం, చిట్టీలు అధిక వడ్డీల పేరుతో నమ్మబలికి బాధితుల నుంచి విడతల వారీగా దాదాపు రూ.4 కోట్ల వరకు వసూలు చేసి అదృశ్యం అవ్వడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది.**

**అమీన్పూర్ ఆగస్టు 2 సిరి న్యూస్**

బిఎస్ఆర్ కాలనీకి చెందిన ఓ మహిళ చిట్టిల వ్యాపారం పేరుతో స్థానికులను నమ్మించి వారి దగ్గర నుండి రూ.4 కోట్ల రూపాయలు వసూలు చేసి సొంత ఇల్లును కూడా అమ్ముకొని హుడాయించింది. స్టేషన్ బాట పట్టిన బాధితులు తమకు రావలసిన డబ్బులు ఇవ్వకుండా సదరు మహిళ చేతులెత్తేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులంతా ఒక్కసారిగా పోలీస్ స్టేషన్కు చేరుకొని ఆందోళన వ్యక్తం చేయడం జరిగింది. ఆవిరైన కష్టార్జితం ఇళ్లల్లో దాచుకున్న పొదుపు సొమ్ము , కూలినాలి చేసుకొని కూడబెట్టిన డబ్బులు ఆడపిల్లల పెళ్లి కోసం దాచుకున్న నగదు మొత్తం మోసపోవడంతో బాధితులు కన్నీరు మున్నీరు అయ్యారు. రంగంలోకి పోలీసులు, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.







- "సిరి" కథనానికి స్పందించి హామీలు.. ఆచరణలో మాత్రం శూన్యం
- రోజురోజుకూ పెరుగుతున్న చెరువు నీటిమట్టం
- ముంపు ముప్పు తప్పదనే స్థానికుల ఆందోళన
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

# రాయసముద్రం కాల్వలకు మోక్షం ఎప్పుడు?

## "ఇల్లు కాలాక ఆకులు పట్టుకున్నట్లు" అధికారుల తీరు

**రామచంద్రాపురం, ఆగస్టు 2, (సిరి న్యూస్): "ఇల్లు కాలాక ఆకులు పట్టుకున్నట్లు" అన్న చందంగా రాయసముద్రం చెరువు కాల్వల వ్యవహారంలో అధికారుల తీరు కనిపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "ఉన్న కాలువకు నో కల్వర్టు... లేని కాలువకు కల్వర్టు..!" అంటూ సిరి పత్రిక ప్రచురించిన కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి పలు హామీలు ఇచ్చారు. తూము కాల్వ ద్వారా జాతీయ రహదారి కింద సహజ నీటి ప్రవాహానికి చర్యలు తీసుకుంటామని, కాల్వల ఆక్రమణలను తొలగిస్తామని, ఇరిగేషన్ శాఖతో కలిసి కాల్వలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. అయితే రోజులు గడుస్తున్నా ఆ హామీలు అమలుకు నోచుకోకపోవడంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.**



సిరి
2 | సిరి | www.siridaily.com


"సిరి" కథనానికి స్పందించిన అధికారులు



www.siridaily.com | సిరి | 3

ఉన్న కాలువకు నో కల్వర్టు..

లేని కాలువకు కల్వర్టు!





ఇటీవల కురుస్తున్న వర్షాలతో రాయసముద్రం చెరువు నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. చెరువు పూర్తిస్థాయిలో నిండితే అదనపు వరద నీరు ఏ మార్గంలో వెళ్లాలనే ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. గతంలో సహజంగా ప్రవహించిన అలుగు, తూము కాల్వలు ఆక్రమణలు, మూసివేతలతో తమ అసలు స్వరూపాన్ని కోల్పోయినా, వాటి పునరుద్ధరణ దిశగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు ప్రారంభం కాలేదు. పరిశీలన సందర్భంగా అధికారులు కాల్వల ఆనవాళ్లను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ముఖ్యంగా తూము కాల్వ పునరుద్ధరణ, కాల్వల ఆక్రమణల తొలగింపు, జాతీయ రహదారి కింద సహజ నీటి ప్రవాహానికి మార్గం కల్పించడం అత్యవసరమైన

ప్పటికీ, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయకపోవడమే పనులు ఆలస్యానికి కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, కాల్వల అసలు స్వరూపం, హద్దులు, నీటి ప్రవాహ మార్గాలపై పూర్తి అవగాహన ఉన్న ఇరిగేషన్ శాఖ కూడా తక్షణమే చొరవ తీసుకుని, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుని శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ఆక్రమణలు తొలగించాలి...

వర్షాలు మరింత ఉధృతమై చెరువు పూర్తిస్థాయిలో నిండితే వరద నీరు సమీప కాలనీలు, రహదారులు, వ్యాపార ప్రాంతాల్లోకి చేరే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తుగానే కాల్వలను పునరుద్ధరించి ఆక్రమణలను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. "సిరి" కథనానికి స్పందించి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించడం అభినందనీయమే. అయితే పరిశీలనలు, హామీలు ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలోకి రావాలని, తూము కాల్వ, అలుగు కాల్వలను అత్యవసరంగా పునరుద్ధరించి సహజ నీటి ప్రవాహానికి శాశ్వత పరిష్కారం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాలు మరింత ఉధృతమయ్యేలోపు అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే, రేపు ముంపు సంభవిస్తే దానికి బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు అధికార యంత్రాంగమే సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.



సిరి ఎఫెక్ట్

# పీఏసీఎస్‌ను దేవేందర్ రెడ్డి అభివృద్ధి చేశారనడం హాస్యాస్పదం

## 25 ఏళ్లుగా కోనాపూర్‌కు చేసింది శూన్యం

### రైతుల సొమ్ము దుర్వినియోగంపై సమాధానం చెప్పాలి
### దళితులపై వివక్ష చూపెట్టారు..
### పీఏసీఎస్ వైస్ చైర్మన్, డైరెక్టర్ల విమర్శ

**రామాయంపేట, ఆగష్టు 2 (సిరి న్యూస్): కోనాపూర్ గ్రామ పీఏసీఎస్‌ను దేవేందర్ రెడ్డి అభివృద్ధి చేశారంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా పచ్చి అబద్ధమని, వాస్తవాలను ప్రజల నుంచి దాచిపెట్టి, ప్రచారంతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని పీఏసీఎస్ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మామిడి సిద్ధిరాములు, డైరెక్టర్లు గడ్డం సురేష్, నందు మహిపాల్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షాదుల్లా, సొసైటీ సభ్యుడు సాగర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. సిరి పత్రికలో కోనాపూర్ గ్రామ పిఏసిఎస్ కు సంబంధించి అప్పటి చైర్మన్ దేవేందర్ రెడ్డి విషయంలో వచ్చిన ప్రత్యేక కథనానికి వారు స్పందించారు.**

ఆదివారం సాయంత్రం రామాయంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా కోనాపూర్ గ్రామానికి దేవేందర్ రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం, రైతుల ప్రయోజనాల కోసం పనిచేసిన దాఖలాలు లేవని, ఇప్పుడు అభివృద్ధి పేరుతో ప్రచారం చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆరోపించారు. దళితుల విషయంలో దేవేందర్ రెడ్డి వివక్షతో వ్యవహరించారని సిద్ధిరాములు ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన గోపాల్ రెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, గతంలో దళిత సీఈఓ సిద్ధిరాములుపై మాత్రం చర్యలు తీసుకోవడం వెనుక కారణాలు ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. చట్టం అందరికీ సమానంగా





దేవేందర్ రెడ్డి బాధ్యతల స్వీకారంతో 'కోనాపూర్' ప్రగతి!

108 సొసైటీలలో 'ఏ' గ్రేడ్ స్థానంలో..

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)



4 | సిరి | www.siridaily.com

దేవేందర్ రెడ్డి బాధ్యతల స్వీకారంతో 'కోనాపూర్' ప్రగతి!

108 సొసైటీలలో 'ఏ' గ్రేడ్ స్థానంలో..

ఉండాలే గానీ, సామాజిక వర్గాలను బట్టి వ్యవహరించడం తగదని అన్నారు. పీఏసీఎస్‌లో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ, కోట్ల రూపాయల లెక్కలపై ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. రూ.2.26 కోట్లు, రూ.1.65 కోట్ల అంశాలను పక్కన పెడితే, అసలు రైతుల సొమ్ము దుర్వినియోగం జరిగిందా లేదా అనే విషయాన్ని స్పష్టంగా చెప్పాలని దేవేందర్ రెడ్డిని ప్రశ్నించారు. రైతుల కష్టార్జిత ధనాన్ని దుర్వినియోగం చేసి, అనంతరం కోర్టులను ఆశ్రయిస్తూ, తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పత్రికల్లో తమకు అనుకూలంగా వార్తలు రాయించుకోవడం ద్వారా వాస్తవాలను మార్చలేరని, బయటివారు నమ్మినా నమ్మకపోయినా కోనాపూర్ గ్రామ ప్రజలకు మాత్రం అసలు నిజాలు బాగా తెలుసునని అన్నారు. ప్రచారంతో చరిత్ర మారదని, చేసిన పనులే ప్రజల ముందు నిలుస్తాయని వ్యాఖ్యానించారు. దేవేందర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ఉన్న సమయంలోనే అదే పార్టీ నాయకులు ఆయనపై ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదుల ఆధారంగా అధికారిక విచారణ కూడా జరిగిందని తెలిపారు. కాబట్టి ఇప్పుడు తాము చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవి కాదని, గతంలో నమోదైన అంశాల ఆధారంగానే మాట్లాడుతున్నామని పేర్కొన్నారు. పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, రైతులకు జరిగిన నష్టాన్ని పూడ్చేలా చర్యలు ఉంటాయని, వాస్తవాలను ప్రజల ముందుకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కోనాపూర్ గ్రామం స్థానిక ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ ద్వారా అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తున్నది తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్లు మామిడి సిద్ధరాములు, నందు మహిపాల్ రెడ్డి, గడ్డం సురేష్, పిఏసిఎస్ సభ్యుడు సాగర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షాదుల్ల ఉన్నారు.